విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 20, అక్టోబరు 2024

ముస్లిం యువతి పెళ్లికి డబుల్ కాట్ మంచం అందజేత

విశాలాంధ్ర - నంద్యాల .. నంద్యాల పట్టణానికి చెందిన నిరు పేద ముస్లిం యువతి పెళ్లికి డబుల్ కాట్ మంచాన్ని షాదీతోఫా కింద అందజేసినట్లు టీడీపీ నాయకులు, బిస్మిల్లా ప్లైవుడ్ ప్రొప్రై టర్స్ షేక్ సుభాన్, షేక్‌అబ్దుల్ గఫార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారంప్ర& రూ.25 వేల రూపాయలు గల డబుల్ కాట్ మంచాన్ని యువతి. పెళ్లి కోసం అందజేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ముస్లిం సమాజంలో నిరుపేద, పెళ్ళి కాని యువతులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారికి తమ వంతుగా ఇటువంటి సహాయాలు చేయడం వల్ల పుణ్యం వస్తుందని, డబ్బులున్న ధనికులు ఇటువంటి సత్కార్యాలు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

శిరీషను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.. సీపీఐ

విశాలాంధ్ర, నందికొట్కూరు : మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన శిరీష అనే మహిళ పొలంలో పనిచేస్తుండగా హత్య చేసిన ఆమె సొంత మామ కురుమన్నను కఠినంగా శిక్షించి ఈ సంఘటన పై హైకోర్టు జడ్జి చేత న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి అన్నారు. శనివారం నందికొట్కూర్ పట్టణంలోని పటేల్ కూడలిలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు వి.రఘు రామ్మూర్తి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ లు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా సొంతమామనే కోడలు శిరీషపై మొక్కజొన్న పంట పొలంలో అత్యాచారయత్నా నికి పాల్పడడం చాలా సిగ్గుచేటుగా ఉందన్నారు. కోడలు శిరీష ప్రతిఘటించగా ,మామ కురుమన్న అత్యంత కిరాతకంగా బండరాయితో ఆమె తలపై బాది హత్య చేయడం హేయమైన చర్య అని, నిందితుడైన మామ కురుమన్నను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శిరీష హత్యపై సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా మహిళల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో పాటు, హత్యకు పాల్పడిన వారి పట్ల సత్వర విచారణ చేపట్టి కఠిన శిక్ష అమలయ్యేల తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు మృతురాలు శిరీష కు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ ధర్నా ఉద్దేశించి మాట్లాడుతూ మృతురాలు శిరీష హత్యకు పాల్పడిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సిపిఐ శ్రేణులు ఆందోళనను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ నాయకులు శంకర్ నాయుడు, ఉస్మాన్ భాష, నాగస్వాములు, ప్రతాప్, రాము, ఏపీ మహిళా సమాఖ్య నగర నాయకురాలు సులోచనమ్మ, శ్రీమతి సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రానికి కమిషనర్ అడ్డగోలుగా నోటీసులు ఇవ్వడం దుర్మార్గం

విశాలాంధ్ర - నంద్యాల

నంద్యాల మున్సిపల్ పార్క్ లో ఉన్న యోగా కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అడ్డగోలుగా నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. బాబాఫక్రుద్దీన్ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో గత దశాబ్దాలుగా పట్టణ ప్రజలకు దీర్ఘ కాలిక రోగులను నయం చేసే రీతిలో జాతీయస్థాయిలో ఉన్న యోగ కేంద్రాన్ని ఉచితంగా ఏమాత్రం ఆశించకుండా ప్రజలకు నేర్పుతున్న ఆనంద్ గురూజీ గత పార్లమెంట్ సభ్యులు ఎస్పీ రెడ్డి సూచన మేరకు ఎంపీ నిధులతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో యోగ ఆశ్రమం నిర్మించి ప్రజలకు చేరువలో ఉన్న ఆశ్రమాన్ని ఏమాత్రం అవగాహన లేని నంద్యాల మున్సిపల్ కమిషనర్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గ చర్య అన్నారు. నంద్యాల పట్టణంలో మున్సిపల్ స్థలాలన్నీ గతంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుడిగా చలామని అవుతున్న నాయకులు కబ్జా చేస్తే వాటిపై ఏమాత్రం విచారించకుండా నిమ్మకు నిరెత్తినట్టు ఉన్న మున్సిపల్ కమిషనర్ ప్రజా సేవ చేస్తున్న యోగా గురువు ఆనంద్ గురూజీ నిర్మించిన ఆశ్ర మంపై దృష్టి పెట్టడం తగదని, పట్టణంలో ప్రతాప్ టాకీస్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో కొంతమంది దళితులు తమ జీవనం సాగిస్తుంటే వారి కడుపు కొట్టి ఇప్పుడు అధికార పార్టీ ముసుగులో కబ్జా చేసి రెండతస్తుల భవనం కట్టినా కళ్ళున్న గుడ్డి వాడలే చూస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇలాంటి అనేక మున్సిపల్ స్థలాలను కబ్జా చేసిన కబ్జాకోరులపై దృష్టి పెట్టి మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని, పది మందికి సేవ చేస్తున్న యోగా ఆశ్రమంపై ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలన్నారు.

ప్రజల సమస్యలు తీర్చడానికే పల్లె పండుగ

విశాలాంధ్ర - నంద్యాల

నంద్యాల మండలం మిట్నాల, గుంతనాల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ భూమి పూజ చేశారు. మిట్నాల గ్రామంలో రూ.12 లక్షలతో, అలాగే గుంతనాల గ్రామంలో రూ.12 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని, కూటమి ప్రభుత్వం వచ్చిన 4 నెలల్లోనే రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రాష్ట్రవ్యాప్తంగా 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రహదారులు ప్రారంభించామని, ఆనాడు జగన్ రెడ్డి ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. 25 వేల గోకులాలు నిర్మించి పాడి రైతులకు అండగా ఉండేలా పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఉద్యానవన రైతుల కోసం 65 వేల ఎకరాల్లో పండ్ల తోటలు సాగుచేసి హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేలా ముందుకు తీసుకెళు న్నామని, ఎన్నికల హామీ మేరకు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఈఓఆర్డి, ఏఈ శంకర్, టిడిపి నంద్యాల మండలం కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, మిట్నాల గ్రామ టిడిపి నాయకులు, లీగల్ సెల్ అధ్యక్షులు శీలం రాజేశ్వర్ రెడ్డి, శీలం నాగ సుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చిలుకూరి రవి చౌదరి, కాశన్న, గ్రామ సర్పంచ్, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి టిడిపి ధ్యేయం - ఎమ్మెల్యే గిత్త జయసూర్య

విశాలాంధ్ర, పాములపాడు :- పల్లెల అభివృద్ధి టిడిపి ధ్యేయమని నందికొట్కూరు శాసనస భ్యులు గిత్త జయ సూర్య తెలిపారు. పల్లె పండుగలో భాగంగా శనివారం వారం ఎర్రగుడూరు భానుమక్కల గ్రామాల్లో కార్య క్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య ఇళ్లలో నియోజకవర్గ టిడిపి నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, ఎంపీపీ సరోజినీ వర్షిన్య, ఎంపీడీవో చంద్రశేఖర్, తాసిల్దార్ సుభద్రమ్మ కలిసి సిసి రోడ్లకు భూమిపూజ చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లెల అభివృద్ధి కొరకు రాష్ట్ర వ్యాప్తంగా 1500 కోట్లతో 30 వేల పనులను ప్రారంభిస్తున్నారని,, 9 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ క్రింద వంద రోజుల పని కల్పిస్తున్నామని, 3000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 25 వేల గోకులం షెడ్ల నిర్మాణం, పదివేల ఎకరాలలో నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఎస్సై- కే.సురేష్‌బాబు, పిఆర్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్, ఏపీవో విమలమ్మ, సర్పంచ్ మంగమ్మ బాయి, ఎంపీటీసీ దుర్గమ్మ భాయి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ హరినాథ్ రెడ్డి, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, బండ్ల మూరి. వెంకటేశ్వరరావ్ భూమా. రాము లమ్మ, సి.గోవిందు, శివశంకర్ స్వామీ జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాలకు మహర్దశ : ఎమ్మెల్యే బుడ్డా..

విశాలాంధ్ర-వెలుగోడు : తెలుగుదేశం ప్రభుత్వం వలనే గ్రామాలకు మహర్దశ పట్టు నుందని, అభివృద్ధి , సంక్షేమము నకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వెలుగోడు మండలంలో శనివారం ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేసారు. మోత్కూరు, తిమ్మనపల్లి, బోయరేవుల, వెలుగోడు, గుంతకందాల గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. శ్రీశైలం నియోజక వర్గంలో 20 కోట్ల నిధులతో గ్రామాలకు సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వెలుగోడు మండలంలో రెండు కోట్ల 27 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను, 125 రోజులలో ఎక్కువ శాతం నెరవేర్చామని అన్నారు. తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, పంచాయతీరాజ్ డిఈ ధనరాజ్, ఏఈ శ్రీనివాసులు, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీ డి రజియా బేగం, ఏపీవో మల్లికార్జున, తెలుగుదేశం నాయకులు అబ్దుల్ కలాం, ఎల్లాల కృష్ణుడు, శేషి రెడ్డి, ఖలీల్ , మోమిన్ రసూల్, రామానాయుడు, సుధాకర్ రెడ్డి, నాగశేఖరు పాల్గొన్నారు

అన్న క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్ : శనివారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మరూఫ్ ఆసియా, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు యం. ఏ.రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబులు ప్రారంభించారు. అనంతరం వంటకాలను పరిశీలించి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవిందరెడ్డి, వేణు, శివ ప్రసాద్ రెడ్డి, కలిముల్లా, ఆశ్రఫ్ అలీ, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మద్యం షాపును మార్చండి

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : మండల కేంద్రంలో మసీదు పక్కన, జెడ్పి పాఠశాలలకు ఎదురుగా ఏర్పాటుచేసిన ప్రవేట్ మద్యం దుకాణాన్ని తొలగించాలని వామపక్ష నాయకుడు దావీద్ ప్రభుత్వాన్ని శనివారం డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన మద్యం దుకాణాన్ని దుకాణం దారుడు మసీదు, బడి పక్కన ఏర్పాటు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. పవిత్ర స్థలం పక్కన, బడి,పోలీస్ స్టేషన్ ఎదురుగా అమరావతి అనంతపురం జాతీయ రహదారి 544 డి పక్కన ఏర్పాటు చేయడంతో ప్రభుత్వంపై విమర్శలు వెలువెత్తుతున్నాయన్నారు మద్యం దుకాణాన్ని మరోచోట ఏర్పాటు చేయాలని, లేదంటే కమ్యూనిస్టులతో కలిసి షాపు ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర ఆత్మకూర్ రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు అక్టోబర్ 22న జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.పద్మావతిబాయి తెలిపారు. శనివారం జాబ్ మేళ కం పత్రం ఆవిష్కరించారు. జాబ్‌మేళలో 4 కంపెనీల ప్రతినిధులు వస్తున్నా రని, జీతం 16వేల నుంచి 20వేలు వరుకు ఉంటుందని 10 వ తరగతి ఆపై చదివిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర, ప్యాపిలి : మండల పరిధిలోని శనివారం రాచర్ల గ్రామ సమీపంలో ప్రియా సిమెంట్ జియం.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. జియం మాట్లాడుతూ ప్రియా సిమెంట్ యాజమాన్యం హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్ డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని చేపట్టామని 500 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రియా సిమెంట్ సిబ్బంది డీజీఎం ఆనంద్ భాస్కర్, పి ఆర్ ఓ కోటేశ్వర్ రెడ్డి, సాంబశివరావు, యశోద హాస్పిటల్ డాక్టర్లు మానస రెడ్డి, నితిన్ చంద్ర, ధర్మ తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఓబులంపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: మండలంలోని ఓబుళంపల్లె గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధి హామీ నిధుల కింద 40 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం పనులకు మరి కొన్ని అభివృద్ధి పనులకు గ్రామ టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకటరామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ప్రతి మండలానికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు కూడా చేపడతామని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మహమ్మద్ హనీఫ్ భాష మాట్లాడుతూ ఉపాధి హామీ నిధుల కింద మండలానికి 2.70 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు.

బాధ్యతగా వ్యవహరిస్తే అభివృద్ధి బాట

విశాలాంధ్ర-చాగలమర్రి : వార్డు సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తే. గ్రామపంచాయతీలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఎంపీడీఓ మంజులవాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్‌లు, ఇద్దరేసి వార్డుసభ్యులకు రెండురోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో వార్డు మెంబర్లకు, ఉపసర్పంచ్ లకు శిక్షకులు ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్,పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ లుమొదటిరోజు పారిశుధ్యం, గ్రామ పంచాయతీలలో వార్డు మెంబర్ల, ఉప సర్పంచుల పాత్ర, పంచాయతీ రాజ్ చట్టం గురించి వివరించారు. 2వ రోజు పంచాయతీల ఆర్థిక వ్యవహారాలు, పంచాయతీల పరిధిలో లే అవుట్సు, నియమ నిబంధనలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వీటిలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల పాత్ర గురించి వివరించారు. అనంతరం శిక్షణాకార్యక్రమంలో పాల్గొన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేంద్ర ప్రసాద్,సీనియర్ సహాయ కులు బాలనరసింహులు, జూనియర్ సహాయకులు బషీర్ అహమ్మద్, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రైతు కష్టం వర్షార్పణం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లా వ్యాప్తంగా తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రైతులకు కడగండ్లు మిగిల్చాయి. నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు నిండా మునిగిపోయారు. ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్లో 8744 హెక్టార్లలో రైతన్నలు మొక్కజొన్న సాగు చేశారు.. అత్యధికంగా రుద్రవరం మండలంలో 3546 హెక్టార్లలో సాగు చేయగా అత్యల్పంగా గోస్పాడు మండలంలో 106 హెక్టార్లలో రైతన్నలు సాగు చేశారు. ఆళ్లగడ్డ మండలంలో 2412 హెక్టార్లు, చాగలమర్రి మండలంలో 1940 హెక్టార్లు, సిరివెళ్ల మండలంలో 740 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతన్నలు సాగు చేశారు. ఒకవైపు తుఫాను ప్రభావంతో పొలాల్లో సాగు చేస్తున్న పంటలు దెబ్బతింటుండగా కోతకు వచ్చిన మొక్కజొన్న ధాన్యాన్ని కోసి రోడ్లపై ఆరబోసుకున్న రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వర్షం తాకిడికి మొక్కజొన్న గింజలు రంగు మారడంతో పాటు రోడ్లపైనే మొలకెత్తడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేలు, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికి వచ్చిన సమయానికి తుఫాను కారణంగా దెబ్బతినింది. బాచాపురం, నరసాపురం, అహోబిలం, ఇటు ఆళ్లగడ్డ-కాసింతల బైపాస్ రోడ్డులో కిలోమీటర్ల మేర మొక్కజొన్న ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్నారు. తుఫాను కారణంగా ధాన్యంపై టార్పలిన్ పట్టలు కప్పి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ధాన్యం తడిసిపోయి మొలక ఎత్తడంతో మూడు నెలలపాటు శ్రమించిన రైతు కష్టం మూడు రోజులలో ఆవిరి అయిపోయింది. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుంటలను తలపిస్తున్న పంట పొలాలు

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలో గత ఐదు రోజులుగా తుఫాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు, పొంగిపొర్లాయి. పొలాలు వర్షపు నీటితో కుంటలను తలపిస్తున్నాయి. భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బి రహదారిలో ఇంజెడు గ్రామ సమీపంలో ఉన్న వంతెనపై వర్షపు నీరు ప్రవహిస్తూ ఉంది. ఈ వంతెన భూమికి సమాంతరంగా ఉండడంతో ఈ రహదారిలో వెళ్లే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు రబీలో సాగుకు అనుగుణంగా వర్షం పడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్లో సాగు చేసిన పంటల్లో ఎక్కడ చూసినా నీటి మడుగులు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూటమితోనే పల్లెల అభివృద్ధి

విశాలాంధ్ర -గడివేముల: కూటమి ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధని మండల మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కె.బొల్లవరం గ్రామంలో శనివారంనాడు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కె.బొల్లవారం గ్రామానికి 15లక్షల రూపాయలు ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచి బత్తుల సుభద్రమ్మ ఆధ్వర్యంలో మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. గత వైసిపి ప్రభుత్వం కరెంటు బిల్లులు కూడా చెల్లించకుండా గ్రామపంచాయతీలను గత వైసిపి ప్రభుత్వం అప్పుల పాలు చేసిందన్నారు. పల్లెలను అభివృద్ధి చేయలేని అసమర్థ సీఎంగా జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండరాజు నాగరాజు, బాల చంద్రుడు, జిల్లా బీసీసెల్ అధ్యక్షులు అంగజాల కృష్ణ యాదవ్, గిరిబాబు, కంది శ్రీనివాసు,ఈఓఆర్డి మహేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

సిసి నిర్మాణాలకు భూమి పూజ

విశాలాంధ్ర-చాగలమర్రి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నేలంపాడులో రూ 20 లక్షలతో,రాంపల్లెలో రూ.4 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించినట్లు సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించినట్లు ఎంపీడీవో మంజులవాణి తెలిపారు. కార్యక్రమం లో పిఆర్ ఏఈ కొండారెడ్డి,ఏపీఓ నిర్మల, పంచాయతీ కారదర్సులు శేఖర్‌రెడ్డి,రాజేష్,టిడిపి నాయకులు ఒంటెద్దు వెంకటేశ్వర రెడ్డి,జనార్ధనరెడ్డి, రాంపల్లె శివారెడ్డి, పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ

విశాలాంధ్ర-అవుకు: పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ రానున్నదని తెలుగుదేశం నాయకులు ఈరన్నగారి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని మంగంపేట మంగంపేట తండాలలోమండల అభివృద్ధి అధికారి వెంకన్నతో కలిసి తెలుగుదేశం నాయకుడు ఈరన్న గారి శ్రీనివాసులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలసుబ్బమ్మ, సర్పంచు లక్ష్మీ తులసమ్మ, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, కానాల కంబగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ఆర్చరీలో ఐదుగురు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

విశాలాంధ్ర, రుద్రవరం : ఈనెల 18న నంద్యాల లో జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్- 17, 14 ఆర్చరి లో జిల్లా స్థాయిలో గెలిచి రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ అభినందించారు. వారికి మంచి శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంలో ఎంతో కృషి చేసిన పి.డి. శ్రీనివాసులను ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభకనపరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలంటూ అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అక్షయ ఎంపిక

విశాలాంధ్ర, జూపాడుబంగ్లా : మండలంలోని మల్లెం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న అక్షయ రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయులు గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్నూల్ లో అవుట్డోర్ స్టేడియంలో 68వ జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలలో అండర్ 14,అండర్ 17 క్రీడాకారుల పోటీలు జరిగావని ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. త్వరలో విజయనగరం లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థిని అక్షయను, ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందించారు.



రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో ఆళ్లగడ్డ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర -ఆళ్లగడ్డ: కర్నూలు పట్టణంలోని క్రీడో స్కూల్ నందు కీర్తిశేషులు రాజ వర్ధన్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా ఈనెల 17వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో ఆళ్లగడ్డ ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థి గాదంశెట్టి సోహన్ నాలుగవ స్థానంలో గెలుపొంది ట్రోఫీ మరియు నగదు బహుమతి గెలుచుకున్నాడని ప్రజ్ఞా విద్యా సంస్థల ఛైర్మెన్ హేమలత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్ లో దాదాపుగా 350కీ పైగా క్రీడాకారులు పాల్గొన్నారని.. అందులో మా పాఠశాల విద్యార్థి సోహన్ రాష్ట్రస్థాయిలో 4వ స్థానం గెలవడం ఆనందాయకంగా ఉందన్నారు.ఇదే సంవత్సరంలో అంతర్జాతీయ రేటింగ్ కూడా సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

హాస్టల్ మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి .. జడ్జి తంగమని

విశాలాంధ్ర క్రిష్ణగిరి. సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డోన్ సివిల్ కోర్టు సీనియర్ జడ్జి తంగమని అన్నారు . శనివారం కంబాలపాడు ,ఎరుకల చెరువు ఎస్సీ హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వా ఆదేశాల మేరకు హాస్టలను తనిఖీ చేసి సమస్యలను నివేదిక రూపంలో పంపాలని ఉన్నత అధికారుల ఆదేశించడం జరిగిందన్నారు. కంబాలపాడులో ఎస్సీ హాస్టల్ బీసీ హాస్టలను ఎరుకల చెరువు ఎస్సి హాస్టల్ లను పరిశీలించామని, రెండు ఎస్సీ హాస్టల్లో వసతి గదులు, బాత్రూమ్స్ పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. కంబాలపాడు బీసీ హాస్టల్‌లో అదనపు గదుల కొరత ఉందన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారని పిల్లలకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి విద్యను అందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలపై నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. క్రిష్ణగిరి ఎస్సై మల్లికార్జున వార్డెన్లు ఉన్నారు.

విద్యార్థులు వైద్యుల సూచనలను పాటించండి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: విద్యార్థులు వైద్యుల సూచనలు పాటించాలని ఆళ్లగడ్డ సిహెచ్ ఆర్కేఎస్కె హెల్త్ కౌన్సిలర్ మాధవి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోరాష్ట్రీయ కిషోర్ స్వస్త్య కార్యక్రమంలో భాగంగా స్కూల్ హెల్త్, వెల్నెస్ కార్యక్రమం ద్వారా యూనిసెఫ్ హెచ్‌ఐవి పై విద్యార్థులకు ప్రొవిషన్ క్విజ్ యాప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు విద్యార్థులు మరియు కార్యాలయ సిబ్బందికి ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ ఆరోగ్యమిషన్ ఏపీఎస్ హెచ్‌డబ్ల్యుపి ఆర్గనైజేషన్ అనే వెబ్సైట్ ద్వారా అధ్యాపకులు విద్యార్థులను భాగస్వాములను చేసి అవగాహన కల్పించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న, డా.సుదారాణి, డా.రాజు, విజయలక్ష్మి, డా.జయచంద్ర, డా.సుబ్బయ్య, వెంకటేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండలంలో ఈనెల 22వ తేదీ నుండి నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22న తుడుమలదిన్నె, 23, 24, 25 తేదీల్లో మాయలూరు గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించడం జరుగుతుం దన్నారు. 2011 నుండి 2016 సంవత్సరం మధ్యకాలంలో ఆధార్ తీసుకున్న వారు తప్పనిసరిగా అప్డేట్ చేయించుకోవాలని సూచించారు.

రోడ్లపై తవ్విన గుంతలను పూడ్చండి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణంలో కాలేజీ బైపాస్ రోడ్డు (ఓల్డ్ బస్ స్టాండ్ అరుగుల నుండి అయ్యపురెడ్డి నగర్ వరకు మంచి నీటి కుళాయిల కొరకు గుంతలు త్రవ్వి పూడ్చలేదని ఎస్డిపిఐ నాయకులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతి వారు కొళాయిల కొరకు తవ్విన గుండలు పూడ్చి వేయకుండా అలాగే వదిలేశారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మహబూబ్ బాషా, ఎస్డిపిఐ శ్రీశైలం అసెంబ్లీ నాయకులు హుస్సేన్ బాషా, ఫక్రుద్దీన్,సయ్యద్ షఫీ, మునీర్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ 25,116 విరాళం

విశాలాంధ్ర, రుద్రవరం : మండల కేంద్రంలోనిశ్రీ కాశీ విశ్వేశ్వర ఆంజనేయస్వామి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కోసం దాతలు విరాళం అందజేశారు. శనివారం ఎల్లా వత్తుల గ్రామానికి చెందిన పార్శ శేఖర్ శ్రీకాశీ విశ్వేశ్వర ఆంజనేయస్వామి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం తమ వంతు విరాళంగా రూ 25116నగదును దేవస్థానం అధ్యక్షులు నూకల కృష్ణమూర్తి , కోశాధికారి భువనగిరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు నల్లగట్ల వెంకటేశ్వర్లులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధిలో దాతలు సహకరించాలని కోరారు.

సబ్సిడీ సెనగ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర, కొలిమిగుండ్ల : మండలంలోని తోళ్ళమడుగు రైతు సేవ కేంద్రం నందు ఆయా గ్రామ రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. తోళ్ళమడుగు గ్రామ సచివాలయం పరిధిలోని తోళ్ళమడుగు, ఉమ్మాయిపల్లి, కోరుమానుపల్లి, అబ్దుల్లాపురం గ్రామాల రైతులకు టిడిపి నాయకులతో కలిసి అధికారులు సబ్సిడీ సెనగ విత్తనాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు ఆదినారాయణ రెడ్డి,గోపాల్ రెడ్డి, రామ్మోహన్ నాయక్, విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, ఆదివారం 20, అక్టోబరు 2024

అన్నదాత సుఖీభవః సహాయంపై నిర్లక్ష్యం తగదు

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు అందిస్తామన్న రూ 20 వేల పెట్టుబడి సహాయం పై నిర్లక్ష్యం తగదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం హెచ్చరించారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడం రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోందని ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంట కోతలు, రబీ పంటలకు అవసరమయ్యే మందులు, ఎరువులకు ఉపయోగపడే విధంగా కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రైతు భరోసా నిధులువిడుదల చేయాలన్నారు. 2018లో వర్షా బావ పరిస్థితుల కారణంగా అప్పటి టిడిపి ప్రభుత్వం రైతులకు అందిస్తామన్న పంట నష్టపరిహారం నిధులు విడుదల చేయలేదని, ఆ తర్వాత ఏర్పడిన వైసిపి ప్రభుత్వంలో కూడా వైఎస్ జగన్ రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించిన మద్దతు ధర రైతులకు ఏమాత్రం లాభదాయకంగా లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు పంట నష్టపరిహారం తక్షణమే అందించాలన్నారు ఖరీఫ్ 2023లో పంట నష్టపోయిన వారిలో 80 శాతం మందికి మాత్రమే పరిహారం అందిందని, మిగిలిన 20 శాతం మంది రైతులకు కూడా తక్షణమే పరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టితో పాటు పెరిగిన మందులు, ఎరువుల ధరలతో పాటు వ్యవసాయఖర్చులు రైతులకు భారంగా మారాయన్నారు. కేంద్రంలో మోదీ సర్కార్ తీరును నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు, కర్నూలు మండల కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు దొడ్డి పాడు భాష, కృష్ణ నాయక్, సురేంద్ర యాదవ్‌లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా.!!

విశాలాంధ్ర బి ఎమ్మిగనూరు టౌన్ : పట్టణంలోని వ్యాపార సముదాయాలలో వ్యాపారులు 0.51 మైక్రాన్స్ మందం కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను అమ్మినా, వాడినా చర్యలు తప్పవని ఎమ్మిగనూరు మునిసిపల్ కమీషనర్ ఎన్. గంగిరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక శ్రీనివాస కూడలి నందు గల అమరావతి టిఫిన్ సెంటర్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న హెూటల్ యజమానులకు రూ.10 జరిమానా విధించడం జరిగింది. ప్రజలు కూడా తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో శానిటరీ మేస్త్రీలు, సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్మాదానికి బలైపోయిన అశ్విని మృతిపై సమగ్ర విచారణ చేయాలి

కారణమైన సన్నీని కఠినంగా శిక్షించాలి

బి.గిడ్డయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర. బ్యూరో కర్నూలు... ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న అశ్విని అనే అమ్మాయి గ్రామంలో తమ ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన సన్నీ అనే కిరాతకుడు అమ్మాయి ఇంట్లోకి పోయి, వేధింపులకు గురి చేయడంతో అమ్మాయి అవమానానికి గురై చనిపోయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ప్రేమ పేరుతో ఉన్మాదులుగా మారి అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి మానవ మృగాల పట్ల ప్రభుత్వం,పోలీస్ యంత్రాంగము ఉదాసీన వైఖరి అవలంబించడంతో మరింత పేట్రేగిపోతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్విని మృతిపై సమగ్ర విచారణ చేయాలని, ఉన్మాదుల కారణంగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తక్షణమే అశ్విని మృతి కి కారణమైన సన్నీ పై హత్యా కేసులు నమోదు చేసి రెండు నెలల్లో కేసు విచారణ పూర్తయ్యే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు

యువకుల వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర, ఆస్పరి : మండల పరిధిలోని నగరూరు గ్రామంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అశ్విని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో సన్నీ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ అశ్విని అనే విద్యార్థిని పత్తికొండ ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్ చదువుతుందని, దసరా పండుగ సెలవులు కావడంతో సొంత ఊరు నగరూరు కి రావడం జరిగిందన్నారు. అదే గ్రామానికి చెందిన సన్నీ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించమన్నారు. మృతి చెందిన అశ్విని తండ్రి పిచ్చిగుంట్ల వీరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన సన్నీ అనే యువకుని పై క్రైమ్ నెంబర్ 158, 2024 సెక్షన్108 బిఎన్ఎస్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మస్తాన్ వలి తెలిపారు.

ప్రభుత్వాలను ఎదిరిద్దాం సర్కారు విద్యను కాపాడుకుందాం

విశాలాంధ్ర ఆదోని రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎదిరిస్తూ ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ భాష డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 30వ జిల్లా మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆ కళాశాల విద్యార్థుల చేత విడుదల చేశారు. అనంతరం సాబీర్ భాష మీడియాతో మాట్లాడుతూ ఇవ్వగలం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల రాష్ట్రంలో విద్యాసంస్థలు మూతపడడం జరిగిందని, తక్షణమే జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని పేర్కొన్నారు. పై చదువులకు అడ్డంకుగా ఉన్న జీవో నెంబర్ 77ను వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న జీవో నెంబర్ 107, 108 రద్దు చేయాలన్నారు. నవంబర్ 12 13 తేదీలలో ఆదోనిలో ఏఐఎస్ఎఫ్ 31 మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, శ్రీకాంత్,జీవన్,మోహన్, సావిత్రి, పూజ, వాణి, వైష్ణవి, వైశాలి తదితరులున్నారు.

సిపిఐ కామ్రేడ్ హనుమప్ప మొదటి వర్ధంతి

విశాలాంధ్ర-మద్దికెర : మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో శనివారం సిపిఐ కామ్రేడ్ హనుమప్ప మొదటి వర్ధంతిని సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ నాగరాజు యాదవ్, వృకాసం అధ్యక్షుడు కామ్రేడ్ కోదండ రాముడు, భార్య కామాక్షిల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఫోటోకు పూలమాలు వేసి జోహర్ జోహర్ అనే నినాదాలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సిపిఐ నాయకులు రామాంజనేయులు, రంగస్వామి పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అభివృద్ధి పనులకు సహకరిస్తాం

విశాలాంధ్ర. మంత్రాలయం నియోజకవర్గ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సహకరిస్తామని వైసిపి ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి. తెలిపారు. శనివారం టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాంపురం , కాచాపురం గ్రామాల్లో ఆయన భూమి పూజ చేయగా బసాపురం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఖగ్గల్లు గ్రామంలో వైసిపి నాయకులు బాబురెడ్డి నాలుగు గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు కింద రూ. 30 లక్షల మంజూరుతో సిసి రోడ్లు పనులకు శ్రీకారం చుట్టామన్నారు.మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ శర్మ ఎంపిడిఓ శోభారాణి పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య, ఎన్ఆర్ ఇజిఎస్ ఏపీడీ లోకేష్, ఏపీఓ తిమ్మారెడ్డి ఈసీ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

విజిలెన్స్ సిఐడి అధికారుల పేరుతో మోసం

ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

విశాలాంధ్ర ఓర్వకల్లు : నకిలీ సిఐడి విజిలెన్స్ కమిషన్ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురిని ఓర్వకల్లు పోలీసులు శనివారం అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఓర్వకల్లు పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పి బాబుప్రసాద్ కేసు వివరాలు వెల్లడించారు. నన్నూరు గ్రామంలోని రాఘమయూరిలో నివాసముంటున్న బెస్త గంగాధర్ ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి 11 గంటలకు నలుగురితో పాటు మరొకరు కలిసి ఒక ఫార్చునర్ కారులో చేరుకున్నారు. నేషనల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఉన్నతాధికారులమని అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో బెస్త శ్రీనివాసులను అరెస్టు చేస్తున్నామని తెలిపారు. రూ.10 వేలు శ్రీనివాసులు ఇచ్చినప్పటికీ కర్నూల్ డీఎస్పికి ఫోన్ చేస్తున్నామని రూ.2.50 లక్షలు ఇస్తే తప్ప వదిలిపెట్టే ప్రసక్తి లేదని బెదిరించారు. పోలీసులుఅక్కడకి చేరుకోగానే వారు తప్పించుకొని ఫార్చునర్ కారును అక్కడ వదిలేసి వెళ్లారు. హుసేనాపురం సమీపంలో టీ స్టాల్‌లో ఉన్న వీరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. అరెస్టు ఆయన వారిలో నలుగురు చిన్న పత్రికలలో విలేకరులుగా పనిచేస్తున్న పాలకిటిమధుసూదన్, శీలం అంకిరెడ్డి, పరదేశి రవికుమార్, కొరతల మహేష్ ఆవుల మధులు ఉన్నారు. వీరి నుండి 7 సెల్‌ఫోన్లతోపాటు రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కర్నూలు తాలూకా సిఐ చంద్రబాబు నాయుడు ఎస్సై సునీల్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు

పన్నులు చెల్లించండి ..

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన వివిధ రకాల పన్నులు వెంటనే చెల్లించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరాభివృద్ధికి పన్నులు ఎంతో కీలకమని, ప్రజలు దీనిని గ్రహించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సెలవు రోజైన ఆదివారం సైతం నగరపాలక కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరన్నారు.

మహిళా రక్షణ చట్టాల గురించి తెలుసుకోండి

విశాలాంధ్ర-గోనెగండ్ల: విద్యార్థినులు మహిళా రక్షణ చట్టాలు గురించి అవగాహన పెంచుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర అన్నారు. శనివారం గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ ఉపేంద్ర, సీఐ గంగాధర్ హాజరై మాట్లాడుతూ మంచి కలలు కనండి, వాటిని సాకారం చేసుకోవడం కోసం, సాధించేవరకు, కష్టపడాలని సూచించారు. మూఢ నమ్మకాలతో జీవితాన్ని పాడుచేసుకోవద్దని తెలిపారు. సదస్సులో ఏపీ మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

చరణ్య వైన్స్‌ను వేరే చోటికి మార్చాలి

విశాలాంధ్ర, ఆదోని రూరల్: తిమ్మారెడ్డి బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చరణ్యశ్రీ వైన్ షాప్‌ను వేరే చోటుకు మార్చాలని కోరుతూ డీహెచ్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, విజయ్, రమేష్, మారెప్ప, గిరి, రాము, గణేష్ శనివారం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు. తిమ్మారెడ్డి బస్టాండు సమీపంలో పేద నిరుపేద కుటుంబాలే అధికంగా ఉన్నారని, దినసరే మార్కెట్ యార్డు, జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీల్లో పనులకు మహిళలు అధికంగా వెళ్లి, వస్తుంటారని.. మద్యం షాపు వద్ద ఆకతాయిలు మత్తులో రాత్రుళ్లు ఇబ్బంది పెడతారని తెలిపారు. చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు తప్పవన్నారు.

చంద్రబాబు వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర, హెూళగుంద: ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ కురువ సుధాకర్ అన్నారు. ఎండి హళ్లిలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం సందర్భంగా సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ అధ్యక్షతన భూమి పూజ చేశారు. సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి వీరభద్ర గౌడ ఆదేశాల మేరకు పల్లె పండుగ కార్యక్రమం జరుపుకున్నామని నియోజకవర్గానికి గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి 12 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మించి మాట నిలబెట్టుకున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికార్జున, ఏఈ యమునప్ప, ఏపీవో భక్తవత్సల, ఈఓఆర్‌డి చక్రవర్తి, టిపి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాదర్బాషా, పరమేష్, టిడిపి నాయకులు వీర నాగప్ప, నాగరాజు, దాసప్ప, హెచ్.చంద్ర పాల్గొన్నారు

ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష తప్పదు

విశాలాంధ్ర, కర్నూల్ ఎడ్యుకేషన్ : ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తులకు జైలుశిక్ష లేదా జరి మానా లేదా రెండూ విధించ బడతా యని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు.శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్ దుష్ప్రభావాల గురించి, విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించిన శిక్షలు వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగులో పాల్గొన్నా అందుకు ప్రోత్సహించిన వారికి శిక్ష విధించబడుతుందని తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు భవిష్యత్‌లో సమస్యలు ఏర్పడతాయని చెప్పారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర, మద్దికెర : మద్దికెరలో శనివారం పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు పోలీస్ అమర వీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శ్రీ విద్యా సాయి జూనియర్ కాలేజీలో రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ విద్యార్థులకు వివిధ అంశాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పోలీసు సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

23న రజక వృత్తిదారుల సదస్సు

విశాలాంధ్ర-పత్తికొండ: ఈనెల 23న ఆస్పరిలో జరిగే రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కారన్న పిలుపునిచ్చారు. శనివారం చదువుల రామయ్య భవనంలో రజక వృత్తిదారుల జిల్లా ప్రథమ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. గ్రామీణ పట్టణాలలో రజకులకు అవసరమైన ధోబి గాట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య నియోజక వర్గ కార్యదర్శి పెద్దయ్య, నాయకులు హనుమంతు, వీరేష్, రంగడు, రాజప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పగిడిరాయి విద్యార్థి

విశాలాంధ్ర, తుగ్గలి: కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ అండర్17 బాలుర విభాగం పోటీలలో పగిడిరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.హర్షిత్ సన్నాఫ్ ఎం.గుండమ్మ య్య స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వేణు తెలియజేశారు.

గద్వాల సోమన్నకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర-పెద్దకడబూరు : కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడు ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను, అనతి కాల వ్యవధిలో 57 పుస్తకాలు వ్రాసి, ముద్రించడమే కాకుండా బాలసాహిత్యంలో విశేష కృషికి గాను గౌరవ డాక్టరేట్ వరించింది. శనివారం హైదరాబాద్‌లో ప్రముఖుల సమక్షంలో డాక్టరేట్ అందుకున్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : మద్యం షాప్ విషయంలో టిడిపి సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి పై ఆ పార్టీకే చెందిన నాగరాజు యాదవ్, గూడూరు సుధాకర్ రెడ్డిలు చేస్తున్న ఆరోపణలను టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం సుంకేసుల రోడ్డులోని ఓ ప్రైవేట్ హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడారు.కర్నూలు మండలంలోని సూది రెడ్డి పల్లె గ్రామంలోని పసుపల ప్రాథమిక వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం పై స్థానిక ప్రజలు ఆందోళన చేస్తే, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి రౌడీలను పంపించారని చెప్పడం దుర్మార్గమని తెలిపారు. మద్యం దుకాణాన్ని 24 గంటల్లో తొలగించాలని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సెక్రెటరీ నోటీస్ ఇచ్చిన ఖాళీ చేయలేదన్నారు. ఆరోపణలు చేస్తున్న వారు వైసీపీకి కోవర్టులని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకురాలు శ్రీదేవితో నాగరాజ్ యాదవ్ మద్యం వ్యాపారంలో భాగస్వామిగా ఉన్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఆ తర్వాత వైసిపికి కంచుకోటగా ఉన్నా కోడుమూరు నియోజకవర్గంలో ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి టిడిపిలో తిరుగులేని నాయకుడిగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోనే కోడుమూరు నియోజకవర్గంలో అత్యధికంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పిటిసి లను గెలిపించిన నేతగా విష్ణువర్ధన్ రెడ్డికి పేరు ఉందన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో కోడుమూరు టిడిపి నియోజకవర్గ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని మంచి మెజారిటీతో గెలిపించాలని గుర్తు చేశారు. ఎదురు విష్ణువర్ధన్ రెడ్డి పై బురదజల్లే వారి వెనక ఉండి ఎవరో ప్రోత్సహిస్తున్నారాని, వారు ఎవరో తొందరలోనే బయట పెడతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు నిర్వహిస్తున్న వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు వేమన గౌడ్, గజేంద్ర, గోపాల్ నాయుడు సురేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర. బ్యూరో కర్నూలు .. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న బిలీవర్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు డిమాండ్ చేశారు. శనివారం సిఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో లిశ్రీనివాసులు బీసన్న మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన టీమ్ రాజ్ అనే వ్యక్తి బిలీవర్స్ మార్కెటింగ్ కంపెనీ పేరుతో ఐటిఐ, ఇంటర్, డిగ్రీ , అయిపోయిన నిరుద్యోగుల వివరాలు సేకరించి వారికి ఫోన్ చేసి మీరు బిలీవర్స్ మార్కెటింగ్ కంపెనీలో ఉద్యోగస్తులుగా సెలెక్ట్ అయ్యారని మీరు వచ్చి జాయిన్ అవ్వండని చెపుతూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డ్రస్సులు , అలోవెరా లాంటి ప్రొడక్ట్స్ ఇచ్చి తిరిగి మీకు జీతం రావాలంటే వీటిని మార్కెటింగ్ చేయాలని అలా చేయకపోతే నీకు జీతం రాదని ఇంటికి పొమ్మని చెప్తున్నారని ఇది ముమ్మాటికి నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు.బిలీవర్స్ మార్కెటింగ్ కంపెనీ యాజమాన్య పై క్రిమినల్ కేసు నమోదు చేసి ఉద్యోగం వస్తుందని ఆశతో డబ్బులు చెల్లించిన నిరుద్యోగులకు డబ్బులు తిరిగి ఇప్పించే విధంగా ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎలాంటి గుర్తింపు లేకుండా బిలీవర్స్ మార్కెటింగ్ కంపెనీ కర్నూల్ నగరంలో మూడు బ్రాంచీలు నిర్వహిస్తూ దాదాపు 300 మంది నిరుద్యోగుల నుండి వేలకు వేలు వసూలు చేస్తా ఉంటే జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.అదేవిధంగా నిరుద్యోగులు బిలీవర్స్ కంపెనీ వారు చెప్పే మాయమాటలకు లోను కావద్దన్నారు.అ దొక బోగస్ కంపెనీ అని జిల్లావ్యాప్తంగా బిలీవర్స్ కంపెనీలో డబ్బులు కట్టిన నిరుద్యోగులు బయటకు వచ్చి మీ పరిధిలోనే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయాలని వారు నిరుద్యోగులను కోరారు. మరి కొంతమంది మోసపోయిన నిరుద్యోగులు ఏఐవైఎఫ్ దగ్గరికి వస్తే ఏఐవైఎఫ్‌గా నిరుద్యోగులకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని వారు తెలియజేశారు.

తైక్వాండో క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ అభినందన

విశాలాంధ్ర. కర్నూలు : రాష్ట్రస్థాయిలో మెడల్స్, సర్టిఫికెట్లు సాధించిన తైక్వాండో క్రీడాకారులకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్ శనివారం అభినందించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ఐ స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలుర తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారుడికి బ్రాంజ్ మెడల్ వచ్చింది. ముందుగా సెప్టెంబర్ 30న నంద్యాల పద్మావతి నగర్ ఇండోర్‌స్టేడియంలో జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బ్రాంజ్‌మెడల్ సాధించిన జి.ప్రణవ్ శ్రీరామ్ 78 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. జి.ప్రణవ్ శ్రీరామ్‌కి మెడల్స్, సర్టిఫికెట్స్ ఎంఏ.గఫూర్, ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కార్యాలయం జనరల్ మేనేజర్ నరసింహ, జి.పుల్లయ్యలు అందజేసి అభినందించారు.

రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలుపరచాలి..

విశాలాంధ్ర ఆస్పరి : కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, మండల నాయకులు రమేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సు ను జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత రజక ఫెడరేషన్‌ని ఏర్పాటు చేసిందని ఫెడరేషన్ ద్వారా ఇప్పటివరకు రజక వృత్తిదారులకు పనిముట్లు, రుణాలు ఆర్థిక సహకారం అందించేవారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఫెడరేషన్ ని కార్పొరేషన్ చేసి రజక కార్పొరేషన్ కోసం నిధులు కేటాయించకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. వెంటనే రజక కార్పొరేషన్‌కి రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని సొసైటీలకు కార్పొరేషన్ ద్వారా బ్యాంకుతో నిమిత్తం లేకుండా 90 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని.డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీన ఆస్పరి పట్టణంలో ఏపీ రజక వృత్తి దారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సును నిర్వహిస్తున్నామని జిల్లా సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏపీ రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య, ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కారప్పలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రజక వృత్తి దారుల సమాఖ్య మండల నాయకులు ఉరుకుందు, అశోక్, మల్లి, వీరేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర, కౌతాళం కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే గ్రామాలలో పండగ వాతావరణం ఏర్పడిందని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, అడిగోప్పగౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్ అన్నారు. శనివారం ఉప్పర హాల్ వల్లూరు గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రాతనలో రెవెన్యూ గ్రామసభ

విశాలాంధ్ర,తుగ్గలి: మండలంలోని రాతన గ్రామంలో శనివారంరి సర్వేలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామ సభను నిర్వహించినట్లు తహసిల్దార్ నాగరాజు పేర్కొన్నారు. గ్రామంలో 152 మంది తమ సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియజేశారని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు మరోసారి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తామని వెల్లడించారు.

కాల్వ గ్రామంలో నాలుగిళ్లలో చోరీలు

విశాలాంధ్ర ఓర్వకల్లు : మండలంలోని కాల్వ గ్రామంలో వరుసగా నాలుగు ఇళ్లల్లో దొంగలు చొరబడి చోరీలకు పాల్పడ్డారు. శనివారం ఎస్సై సునీల్ కుమార్ తన బృందంతో కలిసి చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. షేక్ మహబూబ్ ఇంటిలో కూతురు పెళ్లి కోసం దాచుకున్న. రూ.3 లక్షల నగదుతో పాటు ఆరు తులాల బంగారు ఆభరణాలను దొంగలు దొంగలించారు. మంగలి వెంకటి సుబమ్మా ఇంట్లో.40 వేలు నగదు, బంగారు కమ్మలు జీమీకీలు దొంగలించారు. మరొక ఇంట్లో నగదుతో పాటు బంగారు కూడా దొంగలించినట్లు పోలీసులు నిర్ధారణ చేశారు. ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు.

స్థలం కబ్జా చేసిన ఎమ్మెల్యే పీఏ

సబ్ రిజిస్టర్ అధికారికి బాధితుడు ఫిర్యాదు

విశాలాంధ్ర-ఆదోని : ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో నివాసం వుంటున్న దంతవైద్యుడు ప్రస్తుత ఎమ్మెల్యే పీఏ రవికిరణ్ మా స్థలాన్ని కబ్జా చేసి మా తల్లి జయలక్ష్మీ పేరిట వున్న స్థలాన్ని కబ్జా చేశారని ప్లాట్ ఓనర్ హరీష్‌బాబు శనివారం సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో వున్న ప్లాటును ప్రస్తుత ఎమ్మెల్యే వద్ద పీఏగా వున్న దంతవైద్యుడు రవికిరణ్ కబ్జా చేసి ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నకిలీ డాక్యుమెంట్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకొని పత్రాలు సృష్టించాడని ఆరోపించారు. ఎస్కేడీ కాలనీలో వున్న ప్లాటు కురువ హనుమంతమ్మ పేరు మీదగా వుండగా, డాక్టర్ రవికిరణ్ తన తల్లి ఎల్.జె.లక్ష్మీ పేరిట ఆధార్‌కార్డులో కురువ హనుమంతమ్మగా సృష్టించి వరుసకు తమ్ముడైన సురేష్‌బాబు పేరిట ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్టోబర్ 16వ తేదిన 23947/2024గా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఆదోని సబ్ రిజిస్టర్‌కు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో కురవ హనుమంతమ్మగా మార్చుకున్నప్పటికి డిజిటల్‌లో మాత్రం ఎల్.జె.లక్ష్మీగా రావడం జరిగిందని, అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన పత్రాలు ఇంకా సబ్ రిజిస్టర్ కార్యాలయంలోనే వున్నాయని తెలిపారు. హరీష్‌బాబు కుటుంబం మొన్న జరిగిన ఎన్నికల్లో ఎంపీగా అవకాశం రానప్పటికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌బాబుతో సత్సంబంధాలు వున్నాయని, ఈ సమస్యను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. హరీష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేస్తామని ఆదోని సబ్ రిజిస్టర్ బాధితుడికి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై వివరణ కోసం ఎమ్మెల్యే పీఏ రవికిరణ్‌ను ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

విశాలాంధ్ర : కోడుమూరు : కోడుమూరు పట్టణంలోని శివ సాయి ఫర్టిలైజర్స్ తదితర దుకాణాల్లో శనివారం మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొనుగోలు, అమ్మకాల లావాదేవీల బిల్లులు వంటి రికార్డులను పరిశీలించారు. ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ రైతులకు యూరియా, రసాయనిక మందులను అధిక ధరలకు అమ్మితే శాఖపరమైన కఠిన చర్యలు ఉంటాయని, అటువంటి వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని డీలర్లకు ఆదేశించారు. స్థానిక టిబిపి కాలనీలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న పెస్టిసైడ్స్ మాత్రమే రైతులకు ఇవ్వాలని కోరారు.

ఇష్టానుసారం చెక్ డ్యాములు ధ్వంసం

- చోద్యం చూస్తున్న అధికారులు
- మండిపడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల రెవిన్యూ పరిధిలో ప్రవహించే వంకలు వాగులపై భూగర్భ జలాల పెంపునకు గత పాలకులు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలను అక్రమార్కులు వారి స్వలాభాల కోసమే ధ్వంసం చేస్తున్నారని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగులు వంకల పక్కన ఉన్న భూముల సైతం ఆక్రమించుకొని కొందరు చెక్ డ్యాముల సైతం ఘూతాల బండ్ల సహాయంతో గత కొన్ని నెలల క్రితం చెక్కుడేమును చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నీరు ఎక్కువగా నిలవడంతో తన పొలానికి జోము ఎక్కుతుందని పంటలు సరిగా రావడం లేదని చెప్పి ద్యామును ధ్వంసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలిసిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా ఒక ద్యాం నిర్మాణాన్ని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేయడంతో నేటికీ వాటిపై చర్యలు తీసుకుని ద్యాం నిర్మాణం చేపట్టకపోవడంపై అధికారుల తీరుపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన చెక్ డ్యాములను తిరిగి పునరుద్ధరించి వర్షాపు నీరు నిలి చేలా పాటుపడి భూగర్భ జలాలు పెరిగేందుకు కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నంద్యాలలో ఎక్కడి చెత్త అక్కడే..!

విశాలాంధ్ర నంద్యాల అర్బన్:: పట్టణంలోని ఫరూక్ నగర్ నుండి బాలాజీ కాంప్లెక్స్ మీదుగా భరతమాత దేవాలయం రహదారి వెంట చెత్తాచెదారం పేరుకు పోయి దుర్గంధ భరితంగా మారింది. ఆ ప్రాంతాలలో పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్, నివాస గృహాలు, అపార్ట్మెంట్స్ ఉన్నాయి. ఆ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు వారి ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని, పాత వస్తువులను తీసుకొచ్చి రహదారి వెంట ఉన్న ప్రాంతంలో పడవేస్తున్నారు. చెత్త చేదారాన్ని పాత వస్తువులను పడవేయడం వలన ఆ ప్రాంతమంతా దుర్గంద భరితమై వాసన వెదజల్లుతుండడంతో నిత్యం ఆ రహదారి వెంట వెళ్లే వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. ప్రతిరోజు వీధుల్లో చెత్తను తొలగిస్తున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నప్పటికీ మరి ఆ ప్రాంతంలో చెత్త ఎందుకు నిల్వ ఉంటుందో అర్థం

ఫరూక్ నగర్‌లో ..

కావడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికా రులు అ ప్రాంతాలలోని ప్రజలు చెత్తచెదారాన్ని వేయకుండా ఎలాంటి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు మాత్రం ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారే తప్ప ఈ రహదారులలో చెత్తా చెదారాన్ని పడవేయకుండా అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి, ఆ ప్రాంత ప్రజలు చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

బాలాజీ కాంప్లెక్స్ వద్ద చెత్త ..

రాష్ట్రస్థాయి బాల బాలికల ఫెన్సింగ్ పోటీలకు సర్వం సిద్ధం : డీఈఓ

విశాలాంధ్ర - నంద్యాల ..పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాల బాలికల ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు నంద్యాల నగరం ఆతిథ్యం ఇవ్వబోతోందని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. క్రీడల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. నంద్యాల పట్టణం పద్మావతినగర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో రేపటి నుండి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ క్రీడలు నిర్వహించనున్నారు. ఈ క్రీడలకు 13 జిల్లాల నుండి 350 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడాధికారులు పాల్గొంటున్నారని నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. క్రీడల ఏర్పాట్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రీడల నిర్వహణ కొరకు డిప్యూటేషన్ చేయబడిన వ్యాయామ ఉపాధ్యాయులు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు పాల్గొన్నారు..

గ్రామ పంచాయతీలలో వార్డు సభ్యుల బాధ్యత కీలకం

విశాలాంధ్ర-గోనెగండ్ల: గ్రామ పంచాయతీలలో గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా వార్డు సభ్యులే కీలకమని ఎంపీడీవో మణీమంజరి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆదేశాలమేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి గ్రామానికి ఇద్దరు వార్డు సభ్యుల చొప్పున మరియు ఉప సర్పంచ్ లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మణీమంజరి మాట్లాడుతూ శిక్షణా తరగతులలో గ్రామపంచాయతీ పరిపాలన పారిశుధ్యం, త్రాగునీరు, ఆర్థిక వ్యవహారాలు, గ్రామపంచాయతీ సమావేశాల నిర్వహణ, గ్రామ సభలో,సర్పంచులు మరియు వార్డుసభ్యుల విధులు బాధ్యతలు, కీలకం అని అన్నారు.అలాగే తదితర అంశాలపై వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో బాబురావు , ఈవో ఆర్డీ అనంతసేనా , శిక్షణ పంచాయతీ కార్యదర్శులు ,బన్నూర్ వెంకటేశ్వర్లు,టీ.వెంకటేశ్వర్లు, అబ్దుల్,తోటయ్య, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ కైరవాడిలో రెవిన్యూ గ్రామ సభ

విశాలాంధ్ర-గోనెగండ్ల: హెచ్ కైరవాడి గ్రామంలో రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ కుమారస్వామి హాజరయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే లో ఏవైనా సమస్యలు ఉంటే రైతులు, గ్రామ సభలో రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, సూచించారు.భూ సమస్య అర్జీ రూపం లో ఇవ్వాలని రైతులకు సూచించారు.మీ సమస్య తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డ్యూపీటీ తహశీల్దార్ శిరీష, వీఆర్వో రామకృష్ణ, సచివాలయం సిబ్బంది, గ్రామ సేవకులు, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, రాజేష్,మభాష, శ్రీరాములు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడ్డ సీనియర్ మేటిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: పెద్దమర్రివీడు గ్రామ టీడీపీ నాయకులు మాదిగ నాగరాజు, ప్రభుదాసు,లు అన్నారు .ఈ సందర్భంగా వారు పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటీగా పనిచేస్తున్న ఈ.గజేంద్ర గౌడ్ అవినీతిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండల ఎంపీడీవో మణి మంజీరా కు ఫిర్యాదు చేశారు.పెద్దమర్రివీడు గ్రామంలో పంచాయతీ కింద గ్రీన్ అంబాసిడర్ గా పనిచేస్తున్న జాబ్ కార్డు నెంబర్ 0376 బొగ్గులు మునెప్ప అతని భార్య బొగ్గుల రోజమ్మ ఎంపీపీ ఎస్సీ స్కూల్ నందు స్వీపర్గా పనిచేస్తూ,ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటీ గజేంద్ర గౌడ్ వారి పేర్లపై మస్టర్లు వేసి స్వాహా చేశాడు. అలాగే అంగన్వాడి వర్కర్ గా పని చేస్తున్నటువంటి జాబ్ కార్డు నెంబర్ 0391 వడ్ల పద్మావతి,సర్పంచు మౌనిక, ఉపసర్పంచ్ నరసన్న ఆచారి పేర్ల పైన బదులాగా పేర్లు వేసుకుని ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తు అవినీతికి పాల్పడ్డాడనీ.తక్షణమే సీనియర్ మేటి గజేంద్ర గౌడుపై విచారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మూగమనగుందిలో గ్రామసభ

విశాలాంధ్ర, హెూళగుంద: మండలంలోని మూగమన గుందిలో శనివారం భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగ గ్రామ సభ జరిగింది. తాసిల్దార్ కే సతీష్ మాట్లాడుతూ గతంలో గ్రామ రైతుల భూములను రీ సర్వే జరిపామని ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. రైతులు గ్రామసభలో వీరివిగా దరఖాస్తు చేసుకోవాలని రైతులకు ఎన్నో సమస్యలు తీరుతాయని అన్నారు. అడంగల్, పాస్ పుస్తకాలు, భూ సర్వే కోసం రైతులు గ్రామసభలో ఫిర్యాదించారు. డిప్యూటీ తాసిల్దార్లు నిజాముద్దీన్, ముకుందరావు, వీఆర్వో ప్రహ్లాద పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్

విశాలాంధ్ర, కర్నూల్ ఎడ్యుకేషన్.. విద్యా రంగంలో చేసిన కృషికి గాను లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు ప్రదానం చేసిన ప్రసంశా పత్రాన్ని శనివారం కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష చేతులమీదుగా బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లయన్ డాక్టర్ యస్. నాగస్వామి నాయక్ అందుకున్నారు. విద్యా రంగం, సేవా రంగం, యువత నైపుణ్యాభివృద్ధికి చేసిన సేవలకు గాను ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.

మహిళ మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర, హెూళగుంద : మండలంలోని ఎల్లార్తిలో బోయ షేకమ్మ తీవ్ర అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. మహిళ భౌతిక కాయానికి టిడిపి సీనియర్ నాయకుడు, మల్లిఖార్జున పూలమాలలు వేసి నివాళులర్పించారు మట్టి ఖర్చులకు 5వేలు రూపాయుల ఆర్థిక సహాయాన్ని అందించారు. మల్లికార్జున మాట్లాడుతూ మహిళ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించడానికి సహకరిస్తామని అన్నారు. మహిళ మృతితో కుటుంబానికి తీరని రోడ్డు సంభవించిందని ఆవేదన చెందారు.

టిడిపితోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

విశాలాంధ్ర-చిప్పగిరి: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు పల్లె పండుగ కార్యక్రమం చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామపంచాయతీలో జరిగింది. గ్రామ సర్పంచ్ పురుషోత్తం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంకింద ముట్లూరు శ్రీరాములు ఇంటి నుంచి కురువ రామచంద్ర ఇంటి వరకు సిమెంటురోడ్లు రోడ్డుకు ఇరువైపులాడ్రైనేజీలు రూ. 10 లక్షలు మరియు ఆంజనేయస్వామి గుడి నుంచి మటం వరకు రూ.10 లక్షలు సిమెంటు సిమెంటు రోడ్లు డ్రైనేజీ లకు గాను భూమి పూజ నిర్వహించారు. అలాగే గోకులం షెడ్లు కూడా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు,పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధి హామీ పథకం ఏపీవో మరియు గ్రామ పెద్దలు కొండ ఆంజనేయులు, కొండ రామ గోవిందు ,శావాల వెంకటపతి పాల్గొన్నారు.

ఇవి ఏమి రోడ్లు బాబోయ్

విశాలాంధ్ర,హెూళగుంద: మండలంలోని నాగర కన్వి నుండి హెన్నూరు రోడ్డు భారీ వర్షానికి గుంతల మయంగ, బురద మయంగా ఉండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రాష్ట్ర సరిహద్దులో మరియు వేదవతి నది ఒడ్డున గ్రామాలు ఉన్నందున అధికారులు రోడ్డు మరమ్మతు చేయలేకపోయారని ప్రజలు ఆరోపించారు. రోడ్డుమీద వెళ్లాలంటే భయంగా ఉందని వాహనాలు జారి కిందపడి లేచి ప్రయాణిస్తున్నామని విద్యావంత యువకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు కొనసాగించే రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల నాన అష్ట కష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందారు. రోజు పంట పొలాలకు వెళ్లాలంటే బురద రోడ్లలో నడిచి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తున్నామని రైతన్నలు తెలిపారు రోడ్డు అధ్వాన స్తుతికి చేరుకోవడంతో ప్రజలు అబ్బో ఇవేమి రోడ్లు బాబోయ్ అంటూ ఆందోళన చెందారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే రోడ్డు మరమ్మతు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు

వాము పంటపై రైతుల ఆసక్తి

విశాలాంధ్ర, హోళగుంద: మండలంలో రైతులు ఖరీఫ్, రబి సీజన్లో పత్తి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, ఇతర పంటలను సాగు చేశారు. అయితే కొందరు రైతులు వాము పంట పండించడానికి ఎక్కువ ఆసక్తి చూపించారు. వామ పంటకు కలుపు ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ కూలీల ద్వారా కలుపు నివారణ చేయాలని అలాగే పురుగుల నివారణకు మందు పిచిగారి చేయాలని రైతు కాలప్ప తెలిపారు. మార్కెట్లలో వాము క్వింటాల్ 22 వేల రూపాయలు అమ్ముడు అవుతుంది అందుకోసం రైతన్నలు వాము పంట పండించారు. మండలంలో స్వల్ప మంది మాత్రమే వాము పంట వేసుకున్నారు వ్యవసాయాధికారి ఆనంద్ లోక్ దళ్ అన్నారు. వాముకు ఔషధ లక్షణాలు ఉండడంతో మార్కెట్లో అధిక ధర పలుకుతోందని చెప్పారు.

రీ సర్వే గ్రామ సభకు 12 వినతులు

విశాలాంధ్ర, సి.బెళగల్ : రైతుల భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని సి బెళగల్ తహసిల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తిమ్మందొడ్డి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి విఆర్ఓ శ్రీనివాసులు సమక్షంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. తహసిల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలపై రైతుల నుంచి12 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటిలో భూమి విస్తీర్ణంలో తేడాలు మరియు ఆన్లైన్అలాగే తదితర భూ సమస్యలపై వినతులు వచ్చాయని వచ్చిన వినుతులకు త్వరలోనే పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్‌తోపాటు సర్వేయర్ వీఆర్‌ఓ పాల్గొన్నారు.

గ్రామంలో శాంతిభద్రతలు కాపాడాలి

విశాలాంధ్ర, ఆదోని రూరల్: హెూళగుంద మండలం గజ్జహల్లి గ్రామంలో కులాలకు సంబంధించిన విగ్రహాలు ఏర్పాటు చేయకుండా గ్రామంలో శాంతి భద్రతాలను కాపాడాలని గ్రామ వీరమ్మ, నాగమ్మ, లలిత, రంగప్ప,కధర్ బాషా పలువురు శనివారం సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. బస్టాండ్ ఆవరణంలో ఓ కులానికి సంబంధించిన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పిల్లర్లు ఏర్పాటు చేశారని, బస్టాండ్ ఆవరణ విస్తీర్ణం తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పురు. ఒక కులాన్ని చూసుకొని మరో మిగతా కులాలు విగ్రహాలు బోర్డులు ఏర్పాటు చేసే పరిస్థితి ఏర్పడిన తరుణంలో గలాటాజరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయన్నారు

వర్షానికి నేలకొరిగిన వరి పంట

విశాలాంధ్ర,హెూళగుంద:

మండలంలో ఆయకట్టు రైతులు ఎల్ఎల్సి దిగువ కాలువ, బోరు బావుల ద్వారా పండించిన వరి పంటలు భారీ వర్షానికి నెలకొరిగాయి. కంకి దశకు వచ్చిన వరి పంట విపరీతంగా వీచిన గాలికి , వర్షానికి పంట నెల కొరకడం వల్ల ఆర్థికంగా నష్టం జరిగిందని రైతులు తెలిపారు. వరి గింజలతో ఉన్న పంట నెల కొరిగినందున వరి కోత చేయాలంటే ఇబ్బందిగా ఉంటుందని అందువల్ల ఏమి చేయలేకపోతున్నామని రైతన్నలు ఆరోపించారు. పొలాలను కౌలుకు తీసుకొని వరి పండించామని కోత దశలో ఉన్న పంట నెల కోరడం వల్ల పంటను కాపాడలేక పోతున్నామని రైతులు వాపోయారు. కూలి లతో వరి పంటను ఎత్తివేసిన ప్రయోజనం లేకుండా పోతుందని ఇంకా వర్షం ఎక్కువ కురిస్తే వరి గింజలు నేలపాలవుతాయని రైతులు ఆవేదన చెందారు. మండలంలో ఎక్కువ శాతం రైతన్నల పంట పొలాల్లో వరి పంటలు నెలకొరిగాయి

సీనియర్ టిడిపి నాయకుడి మృతి

విశాలాంధ్ర-చాగలమర్రి .. మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు చల్లా జార్జ్ (70) గుండె పోటుతో మృతి చెందాడు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహా రెడ్డి శనివారం గ్రామానికి చేరుకోని ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో టిడిపి నాయకులు బ్రహ్మానందరెడ్డి,హుసేన్ రెడ్డి,వెంకటరమణ, సంజీవరెడ్డి, శ్రీను, శేఖర్‌రెడ్డి, ఓబులపతి, జీవన్,సౌడన్న తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్దే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర, నందికొట్కూరు : గ్రామాలభివృద్దే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని గ్రామ సర్పంచి మాధవరం సుశీలమ్మ ,ఎంపీటీసీ తిప్పారెడ్డి, మొల్ల హుస్సేన్ మియా అన్నారు.నందికొట్కూరు మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో శనివారం రూ,30లక్షలతో చేపట్టిన సీసీ రహదారి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఈఓఆర్డీ రంగనాయక్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీఓ అలివేలు మంగమ్మ, టీడీపీ నాయకులు మాధవరం రత్నం, మాజీ సర్పంచి కృష్ణ, మొల్ల ఉసేన్ మియ్య ,శంకర్ రెడ్డి,వేల్పుల రాజన్న, గౌండా సాయిబాబా, రంగస్వామి, శెట్టి యేసన్న విద్యా కమిటీ ఛైర్మన్ రషీద్ బాష ,తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయళ్ల అరెస్ట్

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : మండలంలోని పెట్నికోట గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్ బాబు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఆరుగురు గ్రామంలోని రామాలయం వద్ద పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి చేశామని వారి వద్ద నుండి రు 4140 స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం విక్రత అరెస్ట్ : మండలంలోని బెలుం గుహలకు ఎదురుగా హెూటల్ వెనకాల మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. బెలుం గ్రామానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి మద్యాన్ని విక్రయిస్తుండగా అతని వద్ద నుండి 20 క్వార్టర్ బాటిల్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని హెచ్ మురువణి గ్రామ శివారుల్లోని ఎమ్మిగనూరు - కోసిగి రహదారిలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జయమ్మ (57) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. హెచ్ మురవణి గ్రామానికి చెందిన జయమ్మ తోటి ప్రయాణికులతో కలిసి కూలి పనుల నిమిత్తం వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పురుషోత్తం అనే ఆటో డ్రైవర్ ఆటోను అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వెళ్తూ ఉండగా ఆటోలోని జయమ్మ జారి కింద పడినట్లు, దీంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చేర్పించగా జయమ్మ కోలుకోలేక మృతి చెందినట్లు, ఘనటపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో వాహనాలు నడుపే డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామ సమస్యలు తీరుతున్నాయి

విశాలాంధ్ర, హెూళగుంద: చిన్న హ్యాట పంచాయతీకి మజ ర గ్రామమైన బొమ్మ గుండనహల్లిలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సర్పంచ్ డివిస్ హేశానుల్ల అధ్యక్షతన వహించి భూమి పూజ నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకుడు బాడిగేరు పాలక్షప్ప మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ సొంత గ్రామమైన బిజీ హళ్లిలో పది లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ కాలనీలో ప్రజలు రోడ్లు డ్రైనేజీ లేక కాలినడకన నడవలేని పరిస్థితిలో ఉన్నారని ఇ టువంటి సమయంలో వీరభద్ర గౌడ సిసి రోడ్డు, నిర్మాణానికి శ్రద్ధ వహించారని అలాగే పెద్ద హ్యాట, చిన్న హ్యాట లో పల్లె అభివృద్ధి కార్యక్రమానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తుందని ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ హయాంలోనియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని కొనియాడారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని అన్నారు కార్యక్రమంలో ఏయి యమునప్ప, ఏపీవో భక్తవత్సలం, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, ఎంపిటిసి శివన్న, టిడిపి నాయకులు మారేష్, మంజునాథ్, మంజునాథ స్వామి గ్రామ పెద్ద రమేష్ గడ్డం దరగన్న, తదితరులు పాల్గొన్నారు,

నాలుగేళ్లుగా రేషన్ ఇవ్వడం లేదు

విశాలాంధ్ర, సి.బెళగల్. నాలుగేళ్లుగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదంటూ సి.బెళగల్ మండల పరిధిలోని పల్దొడ్డి గ్రామానికి చెందిన కురువ లక్ష్మీదేవి అనే మహిళ పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులతో మొరపెట్టుకున్నారు. శనివారం పల్లె పండుగకార్యక్రమంలో భాగంగా కొండాపురం మరియు పల్దొడ్డి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పల్లె పండుగ కార్యక్రమాల్లో ఇక్కడే అధికారులతో నాకు బియ్యం ఇప్పించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎటువంటి ఫలితం లేదని బతికిన మనిషిని రేషన్ కార్డులో చంపేశారని ఇప్పటికైనా నాకు బియ్యం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం కొండాపురం మరియు పల్దొడ్డి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఐదు లక్షల రూపాయల సిసి రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపిఓ రామన్న, ఈసీ రంగస్వామి, వీఆర్వో రంగముని, కార్యదర్శులు తదితర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విశాలాంధ్ర కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఖాళీగా ఉన్న కస్తూరిబా హైస్కూల్లో టీచర్ పోస్టులకు 1953 దరఖాస్తు చేసుకోగా 49 టీచర్ పోస్టులు మాత్రమే ఉన్నాయి శనివారం డివో కార్యాలయం పైన టీచర్ల పోస్టుల కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగించడం జరిగింది వెరిఫికేషన్ సర్టిఫికెట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కే . సామేల్‌తో పాటు అధికారులు పాల్గొని సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు.

ఉప సర్పంచ్లకు వార్డ్ మెంబర్లకు ముగిసిన శిక్షణ

విశాలాంధ్ర, జిల్లా పరిషత్ కర్నూల్ .. ఆరోగ్యమే మహా భాగ్యమని, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని మండల రిసోర్స్ పర్సన్ గోవర్ధన్, ఆర్ డబుల్ స్ ఎఈ రంగస్వామి అన్నారు. శనివారం కర్నూల్ రూరల్ మండల పరిధిలోని ఉప సర్పంచ్లకు, వార్డ్ మెంబర్లకు రెండో రోజు శిక్షణ ఎంపీడీఓ రఘునాథ్, ఈఓఆర్ డి అనురాధ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ మాట్లాడారు. బహిరంగ మలవిసర్జన మాని టాయిలెట్లను నిర్మించుకోవాలన్నారు. పంచాయతీల స్థలములను ఆక్రమనలను గురికాకుండ కాపాడుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ వినోద్, ఆయా గ్రామాల ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే భూసమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

విశాలాంధ్ర, కోడుమూరు .. గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే సందర్భంగా చోటుచేసుకున్న భూముల సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని మండల తహసిల్దార్ వెంకటేష్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని వర్కూరు గ్రామంలో డివిజనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయింగ్ అధికారి సుబ్బారెడ్డి,గ్రామ స్థాయి అధికారులతో కలిసి రీ సర్వే రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రీ సర్వే భూమి సమస్యలపై రైతుల నుంచి మొత్తం 98 వినతులు వచ్చాయని చెప్పారు. వీటిలో భూమి విస్తీర్ణంలో తేడాలపై 58,జాయింట్ ఎల్పిఎం నంబర్లు సమస్యలపై 16, రీ సర్వే అనంతరం ఆన్లైన్ అడంగల్ నందు నమోదుపై 12, ఎల్పిఎం నంబర్ మ్యాపింగ్ 5,రీ సర్వే అనంతరం పట్టాదారు పాసుపుస్తకాలు అందని వారి నుంచి 7 వినతులు వచ్చాయన్నారు.వీటన్నిటికీ 15 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్, విఏవో,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ

ఆలూరు సివిల్ కోర్టు జడ్జి కట్టా హేమ



విశాలాంధ్ర ఆస్పరి : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీక రించిందని ఆలూరు సివిల్ కోర్టు జడ్జి కట్టా హేమ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బాలికల సంక్షేమ వసతి గృహం, ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాలను ఆలూరు సివిల్ కోర్టు జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, విద్యార్థిని, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను, భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంక్షేమ వసతి గృహాల పరిసరాలను, గుదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులకు శుద్ధమైన పౌష్టిక హారం అందివ్వాలని, వసతులు కల్పించాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకొని బాగా చదువుకొని తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధిలోకి రావాలని అన్నారు. జడ్జి వెంట సీఐ మస్తాన్ వలి ఉన్నారు. కార్యక్రమంలో కోర్టు రికార్డుల అసిస్టెంట్ అరుణ, ఇన్చార్జి వార్డెన్ నాగరాజు పాల్గొన్నారు.